# 'పూర్ణ'కు మిస్ వరల్డ్ కవరేజ్ అవార్డు



ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీలను వీ6, వెలుగు దినపత్రికలో అద్భుతంగా కవరేజీ ఇచ్చినందుకు గాను సీనియర్ జర్నలిస్ట్ కాయల పూర్ణచందర్ కు బెస్ట్ మిస్ వరల్డ్ కవరేజ్ అవార్డును అందజేశారు. మిస్ వరల్డ్ బ్యూటీ సుచత శ్రీ థాయ్‌లాండ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, డీజీపీ జితేందర్ రెడ్డి, టూరిజం ప్రత్యేక కార్యదర్శి జయష్ రంజన్ ల చేతుల మీదుగా పూర్ణచందర్ అవార్డును స్వీకరించారు.

–వరంగల్ వాయిస్, హైదరాబాద్


వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 228
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
జూన్ 10, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# ముంపు తప్పదా..?








చినుకు పడితే ఆ ప్రాంత ప్రజల గుండె గుబేల్ మంటోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోని తూర్పు నియోజకవర్గంలో నివాసముంటున్న అనేక ప్రాంతాల వాసులకు కంటిమీద కునుకు కరువవుతోంది. చినుకు పడిందంటే చాలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారుతున్నాయి. ఎటువైపు నుంచి వరద ముంచుకొస్తుంది.. ఎప్పుడు తమ ప్రాంతాలు నీట మునుగుతాయో తెలియక కాలనీల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఏళ్లుగా ఈ సమస్య పునరావృతం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వరద ముంచెత్తిన ప్రతిసారీ బొందివాగు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందంటూ ప్రకటనలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు ఆ నాలా పనులు పూర్తి చేయించడంలో మాత్రం విఫలమవుతున్నారు. అసలు నాలా పనులను అటకెక్కించి డీసిల్టేషన్ పేరుతో ఇతర నాళాలలోని చెత్తను తొలగిస్తున్నారు. దీంతో ప్రతి ఏటా అమ్మవారి పేట చెరువుతోపాటు, ఖిలా వరంగల్ నుంచి వచ్చే వరద ప్రవాహం హంటర్ రోడ్డుతోపాటు అండర్ రైల్వే గేటులోని అనేక ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. అయితే పర్సంటేజీలకోసమే కొసరు పనులను ముందేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. అధికారుల నిర్లక్ష్యంతోనే పోతన బైపాస్ డ్రైనేజీ పనులు ఆగుతూ సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ఏడు కూడా ముంపు తప్పేలా లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి

- బొందివాగు నీటి ప్రవాహానికి మార్గం కరువు
- భద్రకాళి చెరువుకు ఇన్ ఫ్లో మరిచి అవుట్ ఫ్లో నిర్మాణం పూర్తి
- అసలు పనులకు ఎసరు పెట్టి కొసరుకు కోట్లు ఖర్చు
- ఆగుతూ సాగుతున్న పోతన బైపాస్ డ్రైనేజీ
- వర్షాలు పడితే మునుగుడే అంటున్న నిపుణులు
- చేతులెత్తేస్తున్న బల్దియా అధికారులు

వివరాలు 2లో..

# ప్రసూతి ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు





8లో..



8లో..

# నకిలీలపై సమాచారం ఇవ్వండి

- నాసిరకం విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం



# ముంపు తప్పదా..?

- బొందివాగు నీటి ప్రవాహానికి మార్గం కరువు
- భద్రకాళి చెరువుకు ఇన్ ఫ్లో మరిచి అవుట్ ఫ్లో నిర్మాణం పూర్తి
- అసలు పనులకు ఎసరు పెట్టి కొసరుకు కోట్లు ఖర్చు
- ఆగుతూ సాగుతున్న పోతన బైపాస్ డ్రైనేజీ
- వర్షాలు పడితే మునుగుడే అంటున్న నిపుణులు
- చేతులెత్తేస్తున్న బల్దియా అధికారులు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వర్షాకాలం వచ్చిందంటే గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. ఏళ్లుగా ఈ సమస్య పునరావృతం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వర్షాలతో కాలనీలు నీటిలో తేలియాడుతున్నప్పుడు మాత్రం పరామర్శల పేరుతో పాలకులు, అధికారులు హంగామా చేస్తున్నారు. ఇక మీ కష్టాలు తీరినట్టేనంటూ ప్రకటిస్తున్నారు. ముంపును నివారించేందుకు శాశ్వత చర్యలు చేపట్టామంటూ హామీల వర్షం కురిపిస్తున్నారు. వరద నీరు తగ్గుముఖం పట్టగానే హామీలను మూటకట్టి అదే నీటి ప్రవాహంలో పడేస్తున్నారు. దీంతో ప్రతి ఏడు ముంపు ముప్పు సర్వసాధారణంగా మారింది.

**ఆగుతూ సాగుతున్న పనులు..**

అమ్మవారి పేట చెరువు నీటితోపాటు ఖిలా వరంగల్ చుట్టు పక్కల నుంచి వరద నీరు బొందివాగుకు చేరుతుంది. దీంతో ఈ వాగు పరసర ప్రాంతాలన్నీ వరద ముంపుకు గురవుతున్నాయి. అయితే ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు పోతన బైపాస్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినా పనులు ఆగుతూ సాగుతున్నాయి. వర్షాకాలం ముంచుకొస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో బొందివాగు ద్వారా ప్రవహించే వర్షపు నీటికి మార్గం లేకపోవడంతో ఆ నీరు అనేక ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలంటూ ఆదేశిస్తున్న అధికారులు, పాలకులు కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకురావడంలో మాత్రం విఫలమవుతున్నారనే చెప్పవచ్చు. వారి ఉదాసీనత వల్లే ఈ ఏడు కూడా ముంపు తప్పేలా లేదంటున్నారు.

**షట్టర్ల నిర్మాణంలోనూ నిర్లక్ష్యం..**

గతంలో భద్రకాళి చెరువును వరంగల్ ప్రాంత ప్రజలకు వేసవి జలాశయంగా వినియోగించేవారు. నేడు ధర్మసాగర్ నుంచి తాగు నీరు నేరుగా పట్టణానికి చేరుతున్నందున భద్రకాళి చెరువు నీటిని వినియోగించడం లేదు. దీంతో బొంది వాగు నీటిని నేరుగా భద్రకాళి చెరువులోకి మళ్లించి, అక్కడినుంచి మత్తడి ద్వారా వచ్చిన నీటిని అలంకార్ కాలువ ద్వారా ముచ్చర్ల నాగారం చెరువులోకి తరలించడంద్వారా ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావించారు. ఇందుకు గాను ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ ప్రదేశాల్లో రెండు ఇన్ ఫుట్ షెట్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇది నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ షట్టర్ల నిర్మాణం పూర్తయితే ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత నగర్, సాయి నగర్, ఎస్ఆర్ఆర్ తోట, రాజీవ్ గృహ కల్ప తదితర ప్రాంత ప్రజలకు ముంపు నుంచి రక్షణ లభిస్తుంది. అయితే కాపువడ మత్తడి ప్రాంతంలో మాత్రం రెండు పెద్ద అవుట్ ఫుట్ ల నిర్మాణం మాత్రం చివరి దశకు చేరుకుంది.



## దివ్యాంగ ఆర్పీపై దాడి

**పరామర్శించిన ఆడెపు వెంకటేష్**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 36వ డివిజన్ చింతల్ ఆర్ఎస్ నగర్ ప్రాంతానికి చెందిన వికలాంగురాలు, ఆర్పీ రామగిరి కనకలక్ష్మిపై మహిళలు దాడి చేయడాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ ఖండించారు. వికలాంగురాలైనప్పటికీ నలుగురికి సాయం చేయాలన్న తలంపుతో ఆర్పీగా చేరి మహిళ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుంటే జీర్ణించుకోలేని కొందరు దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఈ దాడిపై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేసినట్లు వెల్లడించారు. మంగళవారం కనకలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మహిళా మండలిలో ఉన్న వారు ఏదైనా సమస్య ఉంటే శాంతియుతంగా చర్చించుకోవాలని సూచించారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్, ఎస్సైలను ఆడెపు వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు, కాలనీ పెద్దలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## 'బండి'కి అభినందనల వెల్లువ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కేంద్ర హోం శాఖ సహాయమంత్రిగా బండి సంజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగికార్ అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ ని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# పాకాలలో ఎకో టూరిజం

- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పాకాలను ఎకో టూరిజంగా మరింత అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అటవీ శాఖ అనూజ్ అగర్వాల్ తో కలిసి క్షేత్రస్థాయిలో నర్సంపేట రేంజ్ లోని పాఖాలలో గ్రీన్ హెరిటేజ్ క్రింద అభివృద్ధి చేసిన బయోడైవర్సిటీ పార్కును, బట్లర్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పగోడాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయుటకు పటిష్టమైన ప్రణాళికలు రచించాలని డీఎఫ్ఓకు సూచించారు. అందులో భాగంగా బయోడైవర్సిటీ పార్క్ ను మరింత అభివృద్ధి పరచడం, పర్యావరణ పర్యాటక అభివృద్ధి చేయాలని, సఫారీ ట్రాక్ ఏర్పాటు, మూలికల తోట పునరుద్ధరణ, సందర్శకులకు రాత్రి బస సౌకర్యాల అభివృద్ధి, చెరకు ప్యాచ్ అభివృద్ధి, పర్యావరణ పర్యాటక సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమార్కులకు కొమ్ముకాసే అధికారులపై చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపట్టిన అక్రమార్కులపై విధుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించి అక్రమార్కులకు అండగా నిలిచే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని గ్రీన్ ల్యాండ్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పట్టించుకోకుండా చూస్తూ ఊరుకుంటారా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైమా గార్డెన్ లో గ్రీన్ ల్యాండ్ క్లబ్ నిర్మాణం, శనిగపురం రహదారి సమీపంలోని పాఠశాల భవన నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారని అధికారులపై మండిపడ్డారు. పట్టణంలోపారిశుద్ధ్యం పడకేసిందని, అలసత్వం వహించే పారిశుద్ధ కార్మికులపై చర్యలు చేపట్టాలన్నారు. పాదాచారులు స్టేషన్ గుండా వెళ్లకుండా నేరుగా నెహ్రూ సెంటర్ నుంచి మదర్ థెరిస్సా సెంటర్ కు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో విద్యుత్, మున్సిపల్, ఇందిరమ్మ ఇళ్ల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూనంనేనిపై పిటిషన్ కొట్టివేత

● హర్షం వ్యక్తం చేసిన తాటిపాముల

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనమనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కూనమనేని సుదీర్ఘకాలంగా ప్రజా సమస్యల పరిష్కారాన్ని తన ముఖ్య లక్ష్యంగా చేసుకుని నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి రెండవసారి భారీ మెజారిటీతో గెలిచి అసెంబ్లీలో వ్యవసాయ కార్మికులు, రైతులు, ఉద్యోగులు, శ్రమజీవులు, యువత, విద్యార్థులు, మహిళలు వంటి అన్ని వర్గాల ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని ఆయన వివరించారు.



అయితే, కూనమనేని విజయాన్ని జీర్ణించుకోలేని కొన్ని స్వార్థపర శక్తులు, ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్ వేశారని, దీని పై హైకోర్టు విచారణ అనంతరం సోమవారం పిటిషన్‌ను కొట్టివేసిందని వెల్లడించారు. ఈ తీర్పును ప్రజా విజయంగా అభివర్ణించారు. ఇలాంటి తీర్పులు ప్రజలలో న్యాయవ్యవస్థపై మరింత గౌరవం, విశ్వాసం పెంచేలా ఉంటాయని వ్యాఖ్యానించారు. న్యాయాన్ని రక్షించే విధంగా తగిన తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ తీర్పు, అబద్ధపు ఆరోపణలతో ఎన్నికల ఫలితాలను మార్చాలని భావించే వారికి గుణపాఠం అవుతుందన్నారు.

# నిబంధనల మేరకే ఇండ్లను నిర్మించుకోవాలి



● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మొగిలిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు వేదికలో 63మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు విడతలవారీగా రూ 5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు.ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని, అలాగే ప్రభుత్వఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని సూచించారు.

# పేదలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్

● కాంగ్రెస్ నేత విష్ణుదాస్ వంశీధర్ రావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అధికార పదవులు కేవలం ఒకే కుటుంబానికి పరిమితమయ్యాయి. జనాభాలో శాతంగా కూడా ఎక్కువ కాకపోయిన ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కె.చంద్రశేఖర్ రావు, కేటీఆర్, హరీష్ రావులు మాత్రమే మంత్రులుగా కొనసాగారు. మిగతా సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించలేదు. పదవులు ఉన్న మంత్రులు కూడా స్వతంత్రంగా ఏ నిర్ణయం తీసుకునే స్థితిలో ఉండరు. వారి కార్యాలయాల్లో వారు ఉండకపోవచ్చు కూడా. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే, ప్రగతి భవన్ లేదా కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి ఆదేశాలు రావాల్సి వచ్చేది. ఈ పరిస్థితులలో, మంత్రులుగా ఉన్న వారు కూడా "మేము కేవలం మంత్రులం కానీ, అసలు అధికార పరిధి మాకుండదు" అని బాహాటంగా చెప్పేవారు. కేసీఆర్, కేటీఆర్ ఆధ్వర్యంలో ఉన్న ఐఏఎస్ అధికారులు మాత్రమే కీలక నిర్ణయాలు తీసుకునే పరిస్థితి. ప్రజలు ఏదైనా అవసరంతో మంత్రుల వద్దకు వెళ్లినా, వారికి సహాయం చేసే స్థితి మంత్రులకు ఉండేది కాదు. ఈ విధంగా ప్రజా ప్రభుత్వాన్ని ఒక కుటుంబ పరిమితంగా మార్చిన పాలనను ప్రజలు తిరస్కరించి, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారు. ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గం అన్ని సామాజిక వర్గాలకు సమాన న్యాయం చేకూర్చేలా రూపొందించబడింది. ఇది ప్రజాస్వామ్యంలో ఒక ఆశాజనకమైన మార్పు. ప్రజలు కోరుకున్న మార్పు



ఇది అని చెప్పవచ్చు. ప్రజలు నిజంగా ఆశీర్వదిస్తే, రాబోయే 25 ఏళ్ల పాటు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగే అవకాశం ఉంటుంది. ఎందుకంటే, గతంలో బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు విలువ లేదు. ప్రజలు నాయకులను కలవలేని పరిస్థితి. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే స్థాయి కూడా ఒకే కుటుంబానికి మాత్రమే పరిమితమైపోయింది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజల మెరుగైన పాలన కోసం ఈ మార్పును స్వాగతించాలని హుజురాబాద్ నియోజకవర్గ మాజీ యువ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ విష్ణుదాస్ వంశీధర్ రావు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

# హనుమాన్ నగర్-6 కాలనీ కమాన్ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జై హనుమాన్ పరపతి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ నగర్ లో కాలనీ కమాన్ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనివాస్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు కందికొండ సదానందం, ఆత్మకూరు దేవేంద్ర చారి హాజరై కమాన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డివిజన్ అధ్యక్షుడు నల్ల సత్యం, ధనికల సుమన్, చింత నిఖిల్, సంఘం కార్యవర్గ సభ్యులు ఆచార్యులు రాజేశ్వరరావు, మల్లారెడ్డి, రాజేందర్, మురళి, సూర్యనారాయణ, రాజేష్, ఉప్పుల రాజు, మురళి, నరేష్, ప్రసాద్, నాగరాజు, శ్రీనివాస్, కాలి చరణ్, మహేష్, వరప్రసాద్, ప్రవీణ్, రాజిరెడ్డి, జగన్నాథం, చంద్ర మొగిలి, భిక్షపతి, నరసయ్య, యాకయ్య, కాలనీవాసులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

# సీఐ బొల్లం రమేష్ ను కలిసిన కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ బొల్లం రమేష్ ను మంగళవారం మార్యదపూర్వకంగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ బొల్లం రమేష్ మాట్లాడుతూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్న వారి సమాచారం వెంటనే పోలీస్ శాఖకు తెలియపరచాలన్నారు. శాంతి భద్రతలు కాపాడడానికి పోలీస్ శాఖకు ప్రజలు సహకరించుటకు నాయకులు చొరవ చూపాలన్నారు. సీఐని కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతం, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య, చీర రమేష్ లు ఉన్నారు.

# అనుమతి లేని షాహిన్ హైస్కూల్ ను సీజ్ చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనుమతి లేకుండా వరంగల్ మండలం పరిధిలోని ఎల్ బీ నగర్ లో నడుపుతున్న షాహిన్ హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ జిల్లా డీఈఓ జ్ఞానేశ్వర్ కు ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ బీ, ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్.శరత్, డి.రోహిత్ , సీ.ప్రశాంత్ లు మాట్లాడుతూ అనుమతి లేకుండా షాహిన్ హైస్కూల్ యాజమాన్యం దర్జాగా అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే డీఈఓ చొరవ తీసుకొని విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా స్కూల్ ను సీజ్ చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులను, విద్యాశాఖ అధికారులను మోసం చేసిన షహీన్ హైస్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**● ఎంఈఓ కునుసోతు హనుమంతరావు**




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చౌటుపర్తి గ్రామపంచాయతీ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిబాట గ్రామసభను మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోడెం రాజేందర్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నడికూడ మండల విద్యాశాఖ అధికారి కె.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తారు. అయితే దానికోసం మన ఊరిలో మనకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యను అందిస్తూ కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఐఎఫ్ పీ టీవీ ప్యానెల్ ద్వారా డిజిటల్ విద్యాబోధన చౌటుపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతుంది. నిరంతర సమగ్ర మూల్యాంకనం, కృత్యాధార, అనుభవజ్ఞులైన అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులచే విద్య బోధన అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్కులు ఉచితంగా అందిస్తున్నారు, ప్రతిరోజు రుచికరమైన పౌష్టికాహారం మధ్యాహ్న భోజనం, వారానికి మూడు గుడ్లు, మూడు రోజులు రాగి జావా, ప్రతినెల తల్లిదండ్రుల ఉపాధ్యాయ సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుంది. కాబట్టి, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తున్నందున గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వ బడి అభివృద్ధి చెందేటట్లుగా గ్రామంలోని ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలు, యువజన సంఘాలు, పూర్వ విద్యార్థులు గ్రామంలోని పెద్దలు అందరూ కలిసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గూడెం రమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పెంచిన ఆర్టీసీ బస్ టికెట్ల ధరలను తగ్గించాలి

**బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్**



**వరంగల్ వాయిస్, పరకాల :** పెంచిన ఆర్టీసీ బస్ టికెట్లను వెంటనే తగ్గించాలని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలతో పాటు, విద్యార్థుల బస్సు పాస్ 20శాతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందన్నారు. ఆర్డినరీ పాస్ ధరను రూ.1.150 నుంచి రూ.1400కు, మెట్రో ఎక్స్ ప్రెస్ పాస్ ధరను రూ.1300 నుంచి రూ.1600కు, డీలక్స్ పాస్ ధరను రూ.1450 నుంచి రూ.1800 పెంచిన టీఎస్ఆర్టీసీ, ఉచిత బస్సు పథకం వల్ల జరిగే నష్టాన్ని భర్తీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడవారికి , మగవారి దగ్గర టికెట్ రేట్లు పెంచి ప్రజల మీద భారం వేస్తున్నారని మండిపడ్డారు. పెంచిన ఆర్టీసీ టికెట్ ధరను వెంటనే తగ్గించాలని, లేకంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున ధరలు తగ్గించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు.

## ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను మంగళవారం మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న విత్తనాల కొనుగోలు సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, అర్హత కలిగిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ పై తయారు తేదీ, గడువు సరిచూసుకోవాలని హెటి కాటన్ బిజీ111 పత్తి రకాన్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. విత్తనాలను ఎవరు లూస్ గా కొనకూడదని, సీల్ ప్యాకెట్లలో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. 70 నుంచి 80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిన తర్వాత మాత్రమే విత్తనాలను విత్తుకోవాలన్నారు.

## రైస్ బ్యాగ్ చాలెంజ్



**వరంగల్ వాయిస్, దామెర :** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో దుర్గంపేట గ్రామం, దామెర మండలం, హనుమకొండ జిల్లాకు చెందిన గునిగంటి వీరస్వామి–జ్యోతి దంపతుల కుమారుడు "గునిగంటి భరత్ " పుట్టినరోజు సందర్భంగా గునిగంటి వీరస్వామి–జ్యోతి దంపతుల సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు, హనుమకొండలో ఉన్న వృద్ధులకు రైస్ బ్యాగ్ చాలెంజ్–145లో భాగంగా 50కేజీల రైస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గునిగంటి వీరస్వామి–జ్యోతి, గునిగంటి భరత్, పగడాల సుమన్, ముదురుకోలా రాజశేఖర్, గొల్లపెల్లి వేణు, ఒడిదేలా మధుకర్, కక్కెర్ల రాజు, మద్ది మహేష్, సిలివేరు నరేష్, సాలంద్ర పున్నంచారీ, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్ ), యాద రవికుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన పగడాల




**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త దామెరుప్పుల మహేష్–కావ్య కూతురు కృతిక శ్రీ పుట్టినరోజు మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి సూర చందర్, జిల్లా దళిత మోర్చ ఉపాధ్యక్షులు వేల్పుల సుధాకర్, మండల నాయకులుగువ్వ సాంబయ్య, దామెరుపుల రంజిత్, దేవేందర్, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లార్డు వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వాసవి క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు యిరుకుల్ల రామకృష్ణ జన్మదిన వేడుకలును వాసవి క్లబ్ హసన్ పర్తి అధ్వర్యంలో భీమారంలోని లార్డు వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు మాట్లాడుతూ అంతర్జాతీయ అధ్యక్షుడి జన్మ దిన వేడుకలు వృద్ధాశ్రమంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఆర్భాటాలకు చేసే ఖర్చులను అన్నదానాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిదర పురవర్ధన్, కోశాధికారి నాగమల్ల మాధవశంకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ అప్పని శంకర్, మాజీ అధ్యక్షులు వెలగందుల భీష్మనాథం, మంచెన శ్యామ్ సుందర్, క్లబ్స్ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

## ఏవీవీ పాఠశాలలో బడిబాట




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మంగళవారం స్థానిక ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం పోతన నగర్, రామన్నపేట ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం పొందిన ఏవీవీ ఉన్నత పాఠశాలలో చదవడం అనేది అదృష్టం కాబట్టి విద్యార్థులంతా ఈ పాఠశాలలో చేరాలని కోరారు. మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ మండల విద్యాశాఖ అధికారి గంప అశోక్ కుమార్ మాట్లాడుతూ 80 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన ఈ పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నది. కాబట్టి ఈ విద్యాసంస్థలో అధిక సంఖ్యలో విద్యార్థులు చేరాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహింపబడుతున్న ఈ బడిబాట కార్యక్రమం ద్వారా అధిక సంఖ్యలో విద్యార్థులు చేరుచున్నందున పాఠశాల పరిసర ప్రాంతాల విద్యార్థులంతా ఈ పాఠశాలలో చేరి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు, విద్యా సలహాదారులు వాసుదేవులు మాట్లాడుతూ ఈ విద్యా సంస్థ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యాభివృద్ధికి గాను విశేష కృషి చేస్తున్నందున ఈ అవకాశాన్ని బడిఈడు పిల్లలందరూ ఉపయోగించుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.బరుపాటి గోపి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

**■ కార్పొరేటర్ పల్లం పద్మ రవి**




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32 డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి స్థానిక డివిజన్ లో బడిబాట కార్యక్రమాన్ని ఆకారపు వీరలక్ష్మి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజుతో కలిసి స్థానిక డివిజన్లో ఇంటింటికి తిరుగుతూ మన బస్తీ– మన బడి ప్రో.జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించిన వారికి సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మంగళవారం ఉపాధ్యాయులు, సెక్రెటరీతో కలిసి బడిబాటలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన అందుతుందని, ప్రైవేటు పాఠశాలలను నమ్మి డబ్బు వృధా చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు రావడానికి, పేద విద్యార్థుల కుటుంబాల మీద ఆర్థిక భారం పడకుండా నాణ్యమైన బోధన ద్వారా మోడల్ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సముద్రాల రాజు, కవిత, శోభారాణి, రాధిక, శ్రీధర్, వాసుదేవ్, సమాచార హక్కు చైతన్య సమితి సాదుల పూర్ణ చందర్, మల్లిపెద్ది సునీత, ఐతం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



➲ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పేద ప్రజలకు ఆరోగ్య విషయంలో సీఎం సహాయనిధి వరం లాంటిదని, ప్రజా ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం వర్ధన్నపేట టౌన్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పర్వతగిరి, ఐనవోలు మండలాల పరిధిలోని 54మంది లబ్ధిదారులకు 15లక్షల 8వేల 950 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆపన్న హస్తం అందిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం చేరే విధంగా అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అదనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో 1500ఇల్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారని, మొత్తం 5వేల ఇందిరమ్మ ఇల్లు ఉన్నాయని అన్నారు. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని గతంలో కంటే మెరుగైన అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. నామీద చేసే దుష్ప్రచారాలు నాయకులు కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.అలాగే మీకు ఏ సమస్య ఉన్న నా దగ్గరికి నేరుగా రాకున్నా నేను మీకు ఇబ్బందులు కలగొద్దని ఒక ఉద్దేశంతో డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 నెంబర్ పెట్టాను, మీరు ఫోన్ కాల్ చేసి మీ సమస్య తెలియజేస్తే త్వరితన సమస్య పూర్తి చేసే విధంగా కృషి చేస్తారన్నారు. దయచేసి ప్రతి ఒక్కరు ఈ సేవలను సద్వినియోగపరుచుకొని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, పాక్స్ చైర్మన్ గొర్రె దేవేందర్, మండల అధ్యక్షులు జటిత్ శ్రీనివాస్ నాయక్, సమ్మెట మహేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పోలపల్లి బుచ్చిరెడ్డి, రాయపురం సాంబయ్య, జున్నపరెడ్డి రుగ్వేద్ రెడ్డి, తొర్రి పద్మ యాదవ్, ఇల్లందుల ఎలీషా, బండి మహేందర్, బానోతు భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, బొల్లబోయిన మధు తో మండలాల

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**వరంగల్ వాయిస్, ఖానాపూర్:** "వికసిత కృషి సంకల్ప్ అభియాన్ – రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఖానాపూర్ మండలంలో పర్యటించారు. ఆమెతో పాటు నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్సంపేట నియోజకవర్గం, చెన్నారావుపేట మండలం, జల్లి గ్రామంలోని రైతు వేదిక వద్ద గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, డీఆర్‌డీఏ, యూనిసెఫ్





సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్నేహ వేసవి సెలవుల ముగింపు కార్యక్రమానికి నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీమతి సంధ్య రాణి, డీఆర్డీఓ కౌసల్య దేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, వరంగల్:** నగరంలోని 21వ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్. బి. నగర్‌లోని పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ శిబిరంలో వాసన్ ఐ కేర్ మరియు భారతీయ అక్యుపంక్చర్ ప్రముఖ వైద్యులు, గోల్డ్ మెడలిస్ట్ హెచ్.ఆర్. భాను సేవలందించారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు సుంకన్నపల్లి శ్రీను, బీజేపీ నాయకులు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, సముద్రాల పరమేశ్వర, బాకం హరిశంకర, పద్మశాలి సంఘం నాయకులు గుండేటి నరేందర్, గోరంట్ల రాజు, అకెన వెంకటేశ్వర్లు, కోమకుల నాగరాజు, బైరి మురళీకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాల్ అందించిన పద్మశాలి సేవా సంఘం వారికి ధన్యవాదాలు తెలిపారు. వైద్యులు హెచ్.ఆర్.భాను



మాట్లాడుతూ, తాము అందించే అక్యుపంక్చర్ చికిత్స మందులు, ల్యాబ్ పరీక్షలు లేకుండానే జరుగుతుందని, ఇది భారతీయ మర్మ కళల్లో ఒకటని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోలేపాక మార్టిన్ లూథర్, అపురూప, రజనీష్ నేత, నోముల రతన్, బింగి మహేష్, కందుకూరి శ్రీనివాస్, స్వర్గం దశరథం, గాదె ప్రభాకర్ తో పాటు పలువురు పద్మశాలి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జూన్ 13న టీడబ్ల్యూజేఎఫ్ తృతీయ మహాసభ

## మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల 13న బాలసముద్రంలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో జరగబోయే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, జిల్లా అధ్యక్షులు టీవీ.రాజు కోరారు. టీడబ్ల్యూ జేఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపస్ లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గోడ పోస్టులను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మహాసభకు తాను తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ నాయకులు ఏ.శ్రీనివాస్, దామెర రాజేందర్, గిరెడ్డి అనిల్ రెడ్డి, దామెర వెంకటేష్, తోటకూర రామ్ దాస్, కొండ్రు దయాకర్, ఎం.శంకర్, ఎండీ భాష, ఈర్ల తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# మే నెల వేతనం, పీఆర్సీ, ఎరియర్స్ తక్షణమే చెల్లించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2025 మే నెల వేతనం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ప్రకటించిన 7నెలల పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) ఏరియర్స్‌ను కూడా తక్షణమే చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్, ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఒక ప్రకటనలో పలు డిమాండ్లు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే బేసిక్ పే వేతనాన్ని ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని కోరారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1న వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు.

# పండగ వాతావరణంలో పాఠశాలల పునః ప్రారంభం

## ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు




**వరంగల్ వాయిస్, పరకాల :** జూన్ 12న పాఠశాలల పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుని పాఠశాలను అందంగా తీర్చిదిద్ది పండుగ వాతావరణంలో పునః ప్రారంభం చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ప్రదానోపాధ్యాయులు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఆశా,పేరెంట్స్ కమిటీ సభ్యులు, వీఓ, లైన్ మెన్ లతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యం, ఇతర దినుసులు సరిగా ఉండేలా చూడాలని సూచించారు. అలాగే, స్కూల్ యూనిఫాం, నోట్ బుక్స్ పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఎలక్ట్రిసిటీ మొత్తం సరిగా ఉండేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నేడు, రేపు సిబ్బందిని పంపించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇల్లు కావాలంటే దూషించారు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని కంటాయపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కావాలని అడిగిన మహిళను కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు దూషించి అవమానపరిచాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ గుగ్గిళ్ళ శ్రీదేవి తమ కుటుంబానికి పక్కా గృహం లేనందున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు కావాలని కోరింది. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకన్న సదరు మహిళను దుర్భషలాడాడు. శ్రీదేవిని అవమానించిన తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు అడుగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోలీస్ అధికారులకు పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శివ కృష్ణ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సోమవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ భుజాలపై సీపీ చేతుల మీదుగా నక్షత్రాన్ని అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.

## సీపీని కలిసిన మిల్స్ కాలనీ సీఐ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ మిల్స్ కాలనీ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేశ్ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్‌ను కలిసి మొక్క అందజేశారు. పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠ పెంచేలా విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలని సీఐకి సీపీ సూచించారు.

## నాయినిని కలిసిన బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని బొద్దిరెడ్డికి ఎమ్మెల్యే నాయిని సూచించారు. నియోజవర్గ అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

# ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన

### ◆ కార్పొరేటర్ అరుణ సుధాకర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రభుత్వం బడుల్లో డిజిటల్ బోధన జరుగుతుండడంతో నానాటికి విద్యార్థుల సంఖ్య ఆ బడుల్లో పెరుగుతుందని కార్పొరేటర్ అరుణ సుధాకర్ అన్నారు. వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి పరిధిలోని 33వ డివిజన్లో గల శాంతినగర్ లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ ప్రధానోపాధ్యాయులు జి.ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బడిబాట గ్రామ సభలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు మెరుగయ్యాయని తెలిపారు. ఇంకా తల్లిదండ్రుల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. పెరికవాడలోని రైల్వే గేట్ బడుల్లో కొనసాగుతున్న ఇంగ్లీష్ మీడియంలో తమ తమ పిల్లల్ని చేర్చి సర్కారు బడుల అభివృద్ధికి దోహదం చేయాలని తల్లిదండ్రుల్ని కోరుతున్నట్లు వారు ప్రకటించారు. తమ డివిజన్ పరిధిలోని రైల్వే గేట్ బడి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు జి ప్రభాకర్, కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే గేట్ బడుల పరిసర ప్రాంతాలలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బడిలో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ అడ్మిషన్లు పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాంతినగర్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశినేని హనుమంతరావు సంతాప సభ

### ▪ హాజరైన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ వినాయక కన్వెన్షన్ లో సీనియర్ నాయకులు దేశినేని హనుమంతరావు తాప సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలసి వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హనుమంతరావు తమకు అత్యంత ఆప్తులు, తమ



కుటుంబంలో ఒకరని అన్నారు. వారి మరణం తమ కుటుంబానికి తీరానికి లోటన్నారు. మా నాన్న కడియం శ్రీహరికి హనుమంతరావు ఒక సోదరుడు అన్నారు. వారు క్యాన్సర్ తో బాధపడుతున్నా.. ఎన్నడు ఆధైర్య పడలేదని తెలియజేశారు. వారి కుమారుడు అచ్చుత్ నాకు సొంత సోదరుడని, వారికి ఎల్లప్పుడు మా కుటుంబం అండగా ఉంటుందని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



వరంగల్ వాయిస్, వరంగల్ : గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని వసంతాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా 93మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రజల కుటుంబ ఆర్థిక పరిస్థితులు అభివృద్ధి చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన బాధితులకు 863 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు.పేదింటి సొంత కళ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ పాలకుల నిర్వాహకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అన్నారు. భారత దేశంలోనే రూ.5లక్షలతో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే ఏకైక పథకం అని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఉచిత బస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నవడ్లకు రూ.500 బోనస్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

# ఆయిల్ ఫెడ్ పై మంత్రి తుమ్మల సమీక్ష

### ■ మంత్రి తుమ్మలకు స్వాగతం పలికిన జంగా రాఘవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బషీర్ బాగ్ పరిశ్రమల భవన్ లోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫెడ్ సంస్థ పనితీరు పై ఆయిల్ ఫెడ్ అధికారులతో చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జూలై నాటికి సిద్ధిపేట జిల్లాలో నిర్మాణమవుతున్న నర్మెట్ట ఆయిల్ పాం ఫ్యాక్టరీ నిర్మాణం పనులు పూర్తవ్వాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ సంస్థ ఆర్థికంగా బలోపేతమవుతూ రైతుకు లాభాలను గడించేలా సీరియస్ గా పని చేయాలని అధికారులకు సూచించారు. ఆయిల్ పాం నర్సరీల పర్యవేక్షణ సరిగా ఉండాలని, నర్సరీ స్థాయిలోనే మొక్కలను సరిగా గుర్తించాలని అందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రైతులకు అంతర్ పంటల విషయంలో సరైన అవగాహన కల్పించాలని, అందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలన్నారు. ఆయిల్ పాం పంటను పొత్సహించడంతో పాటు ఏరియా విస్తీర్ణం పెంచాలని రాష్ట్రంలో 5లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ఆయిల్ ఫెడ్ సంస్థ పనిచేయాలన్నారు. వచ్చే దశాబ్ధానికి అన్ని విభాగాలలో సరిపడ నూతన ఉద్యోగ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ ద్వారా ఆయిల్ ఫెడ్ ఉత్పత్తులను ఉప ఉత్పత్తులుగా మార్చి మార్కెటింగ్ చేసి రెవెన్యూ జనరేట్ అయ్యేలా చేసుకుని సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు.

# మాల్దీవుల బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా




పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు– తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా –కై–ఫ్ గ్లోబల్ అంబాసదర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.

# కింగ్‌డమ్‌కు వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్

ఇవాళ భారీ తెలుగు సినిమాలన్నీ విఎఫ్ఎక్స్ మీదనే ఎక్కువగా ఆధారపడి వుంటుతున్నాయి. ఆ వర్క్ కాస్తంత ఆలస్యమైనా... పోస్ట్ ప్రొడక్షన్ లో ఊహకందని జాప్యం ఏర్పడుతోంది. దాంతో సినిమాలను ముందు ప్రకటించిన తేదీకి విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలోకి నిర్మాతలు జారిపోతున్నారు. పవన్ కళ్యాణ్  సినిమా కూడా ఈ కారణంగానే వాయిదా పడిరది. తాజాగా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీ మళ్లీ వాయిదా పడేలా ఉంది. ఇప్పటికే మే 30న రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించినా.. చివరకు జులై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తారని తెలుస్తోంది. కింగ్ డమ్ కంటే ముందే నితిన్ నటించిన తమ్ముడు మూవీ జులై 4న రిలీజ్ డేట్ ప్రకటించింది. తమ్ముడు మూవీ ఉన్నా సరే రిలీజ్ కు ముందు డేర్ చేసింది. కానీ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జూన్ 12 నుంచి తప్పుకుంది. చూస్తుంటే వీరమల్లు జులై మొదటి వారంలోనే రిలీజ్ కు రెడీ అవుతున్నట్టు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన కూడా రాబోతోంది. ఎటు చూసుకున్నా కింగ్ డమ్ వాయిదా తప్పేలా లేదు. ఎందుకంటే పోటీ– నడుమ కింగ్ డమ్ ను రిలీజ్ చేయడానికి మేకర్స్ రెడీగా లేరు. సోలోగా వచ్చి ఎక్కువ వసూళ్లు రాబట్టాలని చూస్తున్నారంట. అందుకే మరోసారి వాయిదా వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. జులై 25కు వాయిదా వేసే అవకాశం ఉంది.




# కుబేరకు దేవిశ్రీప్రసాద్ టెన్షన్

## పెండింగ్‌లో రీ రికార్డింగ్ పనులు

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర అనే సినిమా ప్రేక్షలు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ధనుష్ హీరోగా, నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో రష్మిక మరో కీలక పాత్రలో నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ దాదాపు ఏడాదిన్నర క్రితం మొదలైంది. సినిమా అనౌన్స్‌మెంట్ అయితే మూడేళ్ల క్రితమే వచ్చింది. ఎట్టకేలకు ఈ సినిమా ఈ నెల 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అమెజాన్ ప్రైమ్‌తో ఉన్న అగ్రిమెంట్స్ కారణంగా ఆ విడుదల తేదీని మార్చలేని పరిస్థితి. అయితే సినిమా రిలీజ్‌కు ఇంకా పది రోజులుంది కానీ ఇంకా ఒక సాంగ్ పూర్తి కాలేదు, అలాగే సినిమా రీ–రికార్డింగ్ కూడా పూర్తి కాలేదు. ఈ విషయాన్ని స్వయంగా నిర్మాత ఏషియన్ సునీల్ తాజా ఇంటర్వ్యూలో వెల్లడిరచారు. ఇక మరో మూడు రోజుల్లో సినిమాకు సంబంధించిన ట్రైలలర్ కట్ రిలీజ్ కావాల్సి ఉంది. ఆ తర్వాత మరో రెండు రోజులకు మరో సాంగ్ రిలీజ్ కావాల్సి ఉంది. దేవిశ్రీ ప్రసాద్ కారణంగా ఎప్పుడూ సినిమాకు లాస్ట్ మినిట్ టెన్షన్ ఏర్పడినట్లుగా సినీ వర్గాల వారు చెబుతున్నారు. శేఖర్ కమ్ముల తన టీంతో కలిసి సినిమాకు సంబంధించిన పెండిరగ్ వర్క్స్ పూర్తి చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాడు. సినిమాకు ఇప్పుడిప్పుడే కాస్త బజ్ పెరుగుతోంది. అయితే దేవిశ్రీ ప్రసాద్ తన అవుట్‌పుట్ ఇచ్చేవరకు సినిమా విషయంలో టెన్షన్ తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ఈ మధ్యకాలంలో సంగీత దర్శకులు రీ–రికార్డింగ్ లేట్ చేయడంతో కొన్నిసార్లు సినిమాలు వాయిదాలు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. ఈ నేపథ్యంలో దేవిశ్రీ ప్రసాద్ ఏం చేస్తాడో చూడాలి.



# చిన్నారుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు

### బసవతారకం ఆస్పత్రిలో కేక్ కట్ చేసిన బాలకృష్ణ

ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల సమక్షంలో బాలకృష్ణ కేక్ కట్ చేశారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు కేవలం ఒక నంబర్ మాత్రమేన్నారు.  తల్లిదండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. మా నాన్న కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశాను. మెడిసిన్ చదవలేదు కానీ.. సినిమాల్లో డాక్టర్ పాత్రలు చేశాను. 15 ఏళ్ల క్రితం బసవతారకం ఆసుపత్రికి ఛైర్మన్ అయ్యాను. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. ఇకపోతే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు విషెస్ తెలిపారు. అభిమానుల కోసం పుట్టినరోజు కానుకగా ఆయన నటిస్తోన్న 'అఖండ 2' నుంచి పవర్‌ఫుల్ టీజర్‌ను చిత్రబృందం పంచుకుంది. ప్రస్తుతం అది భారీ వ్యూస్‌తో సోషల్ మీడియాలో –ట్రెండిరగ్‌లో ఉంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.

### 650 కొబ్బరికాయలు కొట్టిన అభిమానులు

బాలయ్య బర్త్ డే కావడంతో అభిమానులు పండుగలా జరుపుకున్నారు. ఇందులో భాగంగా తిరుమలలోని అఖిలాండం వద్ద బాలయ్య పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి. శ్రీధర్ వర్మ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 650 కొబ్బరికాయలు పగలగొట్టి, 6.5 కిలోల కర్పూరంతో భారీ హారతి ఇచ్చారు.

# ప్రసూతి ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న రోగుల సహాయకుల భవనం, బ్లడ్ బ్యాంక్ ప్రధాన గేట్ పక్కన ఉన్న ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ ప్రసూతి ఆసుపత్రిలో ఓపీ సేవలు, స్కానింగ్ రూమ్, ప్రసవానంతర వార్డులను పరిశీలించారు. బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని సెమినార్ హాల్ లో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న బెడ్ల సంఖ్య, రోజుకు ఓపీ సేవలకు వస్తున్న వారి సంఖ్య, ఇప్పుడున్న వసతులు, వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి నిర్వహణకు వస్తున్న బడ్జెట్, తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రసూతి ఆస్పత్రి అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతల సంఖ్య ఎక్కువగా ఉంటున్నందున ఆస్పత్రి నిర్వహణ బాగుండాలని సూచించారు. ఆసుపత్రిలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలన్నారు. ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు వైద్య సేవలు అందించే విధంగా ఒక పాథాలజిస్ట్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. నియోనాటల్ విభాగం ఉన్నందున అందుకు సరిపోను మందులు, వైద్య ఉపకరణాలు ఉండాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు తమకు అందించినట్లయితే ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఔషధాలు పంపిణీకి సంబంధించి సెంట్రల్ డ్రగ్ స్టోర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసెక్టమి శిబిరాలను నిర్వహించాలని, అలాగే డాక్టర్లకు డబుల్ పంక్చర్ లాప్రోస్కోపీ సంబంధించిన శిక్షణ అందించాలని వైద్య అధికారులకు సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం 2009లో జరిగిందని, ఇప్పుడు 16 ఏళ్ల తరువాత మళ్ళీ అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

### వసతుల కల్పనకు ప్రాధాన్యం..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధికి, వసతులు కల్పనకు తగిన ప్రతిపాదనలు వైద్యాధికారులు అందజేయాలని సూచించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రసూతి ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య, భర్తీ చేయాల్సిన వైద్యులు, సిబ్బంది సంఖ్య, ఇతర వసతులను కల్పించేందుకు సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం కేటాయించే నిధులను అవసరమైన ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి ప్రసూతి, వైద్య సేవలు నిమిత్తం ఎక్కువ మంది వచ్చే విధంగా కృషి చేయాలని ఆస్పత్రి వైద్యాధికారులకు సూచించారు. సాధారణ ప్రసవాలు అయ్యేవిధంగా దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో ఆశా కార్యకర్తల ద్వారా ప్రసూతి సేవలు పొందేవిధంగా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీ, డాక్టర్ అప్పయ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు, అధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

- ఏఐఎఫ్ డీఎస్ జాతీయ నిర్మాణ బాధ్యులు మద్దికాయల అశోక్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ (ఏఐఎఫ్ డీఎస్) జాతీయ నిర్మాణ బాధ్యులు మద్దికాయల అశోక్ ఓంకార్ డిమాండ్ చేశారు. ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు మియాపూర్ ఎంఏ నగర్ ఆఫీసులో మంగళవారం రెండో ప్రారంభం అయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులుగా మద్దికాయల అశోక్ ఓంకార్ పాల్గొని బోధించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ మనువాదాన్ని, విద్య కషాయికరణ అనే ఎజెండాలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని విమర్శించారు. బీజేపీ మనువాద మత చాందస భావాలను వ్యతిరేకిస్తూ శాస్త్ర విద్యా విధానం కావాలని, ప్రవేట్ యూనివర్సిటీల బిల్లులకు వ్యతిరేకంగా, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దుచేసి కామన్ స్కూల్ విద్యా విధానంపై అనేక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సంక్షోభం నుంచి రాష్ట్రం బయటపడడానికి సరైన విధానం తీసుకురాకుండా కొత్తగా వచ్చిన ప్రభుత్వం కొన్ని ఆకస్మిక ఆలోచన, అనాలోచిత చర్యలు చేపడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న 17 యూనివర్సిటీలను సమగ్రంగా అభివృద్ధి చేసే బదులుగా స్కిల్ యునివర్సిటీ అనీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ అని కొన్ని పొంతనలేని చర్యలు చేపడుతుంది ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేల కోట్ల పెండింగ్ ఫీజు రింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు బకాయిలు ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదనపు చెందుతున్నారని ఆరోపించారు. 12 ఎస్సీ గురుకులాల జూనియర్ కళాశాల మూసివేత నిర్ణయాన్నీ వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మలోతు జబ్బర్ నాయక్, జాతీయ కమిటీ సభ్యులు డక్క కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు టెంకటి కుమార్, గడ్డం శ్రీకాంత్, హైదరాబాద్ కన్వీనర్ శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు మార్త నాగరాజు, పోలబోయిన రాజు, సాయిరాం రెడ్డి, కీర్తన, వేణు తదితరు పాల్గొన్నారు.

# వాహనాల మరమ్మతులు వెంటనే జరగాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- ఆకస్మికంగా వాహన షెడ్డు తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యుద్ధ ప్రాతిపదికన వాహనాల మరమ్మతులు పూర్తి చేయాలని వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ హనుమకొండలోని బాలసముద్రంలో నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ ను మేయర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి చెత్త తరలింపు వాహన మరమ్మతులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. వేగవంతంగా మరమ్మతులు చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన 41 స్వచ్ఛ ఆటోలు, తొమ్మిది ట్రాక్టర్లు, నాలుగు డంపర్ పెసర్లు, నాలుగు జేసీబీలు, రెండు హిటాచీలు, నాలుగు కాంపాక్టర్లకు వారంలోగా మరమ్మత్తులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రిపెరింగ్ కోసం షో రూమ్ వెళ్లిన పెద్ద వాహనాల మరమ్మతుల స్థితిగతులను తెలుసుకొని త్వరితంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు అమర్చిన మైకులు సరిగా పనిచేస్తున్నాయో లేవో పరిశీలించి అవసరం మేరకు రిపేర్లు చేయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన కార్యక్రమాలను స్వచ్ఛ ఆటో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా చెత్త తరలింపు వాహనాల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి చెత్త తరలింపులో జాప్యం కలుగకుండా చూడాలన్నారు. ఒకవేళ వాహనాలు మరమ్మత్తులకు గురి అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, ఏఈలు సంతోష్ కుమార్, ఫణి, గుత్తేదార్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీలపై సమాచారం ఇవ్వండి

- నాసిరకం విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం




**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ రైతులకు, ప్రజలకు సూచించారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్నందున రైతన్నలు నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం సీపీ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఎవరైన వ్యాపారస్థులు, సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేసి నకిలీ విత్తనాలను, పురుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల విక్రయాలను నియంత్రియించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం రూ.1.23 కోట్ల విలువ కలిగిన నకిలీ పురుగు మందులు, విత్తనాలతో పాటు పెద్ద ఎత్తున గడ్డి మందును స్వాధీనం చేసుకొని 14మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించడం జరిగిందన్నారు. ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్ నంబర్ 7799848333 ఫోన్ నంబరకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్ రెడ్డి, డేవిడ్ రాజు, ఇన్స్ స్పెక్టర్ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com